# కాంగ్రెస్, బీజేపీలకు మనుగడ లేదు..

- అభివృద్ధి చేసే పార్టీలకే పట్టం కట్టండి
- భారీగా బీఆర్‌ఎస్‌లో చేరికలు



మాజీ సర్పంచ్ నర్సయ్యకు పార్టీ కండువా కప్పుతున్న మంత్రి అల్లోల



బీఆర్‌ఎస్‌లో చేరిన ఎల్లపెల్లి గ్రామ ప్రజలు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 30 : రాష్ట్ర ప్రజలను, రైతులను విస్మరించిన కాంగ్రెస్, బీజేపీలకు మనుగడ లేదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ మండలం ఎల్లపెల్లి గ్రామం నుంచి 200 మంది సభ్యులు, అనంతపేట్ గ్రామ మాజీ సర్పంచ్ నర్సయ్య బీజేపీని వీడి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుక బడిపోయిందని 60 ఏండ్లలో సాధించని అభివృద్ధిని పదేండ్లలో చేసి చూపించామని అన్నారు. నిర్మల్ అభివృద్ధిపై గత పాలకులు నిర్లక్ష్యం చేసి మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు ఓట్ల పేరిట మీ ముందుకు వస్తున్నారని వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, యువ నాయకులు అల్లోల గౌతంరెడ్డి, అల్లోల తిరుపతి రెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

# కుల మతాలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆశీస్సులతోనే ప్రచారం ప్రారంభం

జైనథ్, అక్టోబర్ 30 : కుల, మతాలకు అతీతంగానే తెలంగాణలో అన్ని వర్గాల అభివృద్ధి కొనసాగుతోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కేంద్రంలోని అతిపురాతనదైన శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రోడ్ షో ద్వారా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన మహిళలు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంతోపాటు జిల్లా కేంద్రంలో రూ.కోట్లు వెచ్చించి అన్ని కుల సంఘాలకు సంఘ భవనాలు నిర్మిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌దే అని అన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో పర్ధాన్ సమాజ్ సంఘ భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశామన్నారు.

### కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి..

70 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఆ రెండు పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. ఓటుకు నోటు కేసులో పట్టుబడ్డ రేవంత్ రెడ్డి, రైతులకు మూడు గంటల కరెంట్ సరిపోతుందని అంటాడు టిక్కెట్లు అమ్ముకునే రేవంత్ రెడ్డి, రేపు సీఎం అయితే రాష్ట్రాన్ని అమ్మడనే గ్యారంటి లేదన్నారు. మూడోసారి సీఎంగా కేసీఆర్ మనందరం చూడాలన్నారు. ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ లింగారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ యాసం నర్సింగ్‌రావ్ పాల్గొన్నారు.



జైనథ్ రోడ్ షోలో ఎమ్మెల్యే రామన్నకు వీర తిలకం దిద్దుతున్న మహిళలు



దీపాయిగూడలో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

# బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టండి..

**ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్**

ఖానాపూర్, అక్టోబర్ 30 : వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టి అభివృద్ధికి బాటలు వేయాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని తన నివాసంలో మండల సీనియర్ నాయకులతో రానున్న ఎన్నికల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, కార్యకర్తలు పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే ఖానాపూర్ నియోజకవర్గం సుభిక్షంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్, ఎంపీటీసీ మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.



ఖానాపూర్ మండల నాయకులతో మాట్లాడుతున్న భూక్యా జాన్సన్ నాయక్

# ఆదరించండి.. ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్
- నియోజకవర్గ ఇన్‌చార్జి నగేశ్‌తో కలిసి ప్రచారం



ఉమ్రిలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్

తలమడుగు, అక్టోబర్ 30 : ఆదరించండి.. బోథ్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బోథ్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని ఝరి, పూనగూడ, కప్పర్‌దేవి, ఉమ్రి, దేగామ, పల్సి(బీ), తండా గిరిజన గ్రామాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నగేశ్‌తో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామాల్లో వారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి నగేశ్ మాట్లాడుతూ.. బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆదరించి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తండా గ్రామంలోని నారాయణ బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి

# బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లోకి..

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 30 : నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన జొన్నల మహేశ్‌తోపాటు 50 మంది యువకులు, మహిళలు బీజేపీని వీడి బీఆర్ఎస్ పార్టీలో సోమవారం చేరారు. శాంతినగర్ కాలనీలోని ఏర్పాటు చేసిన సమావేశంలో యువ నాయకులు అల్లోల గౌతంరెడ్డి, తిరుపతిరెడ్డి వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు బీజేపీతో ఒరిగేది ఏది లేదని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 100కు పైగా స్థానాలను గెలిచి కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు.



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన మహేశ్‌కు పార్టీ కండువా కప్పుతున్న అల్లోల గౌతంరెడ్డి

# మంత్రి వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు

సోన్, అక్టోబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు సోమవారం ఉదయం వెళ్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వాహనాన్ని సోన్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు.